AUCHITHYAM
International Research Journal for Telugu Language & Literary Studies
ISSN: 2583-4797
UGC-CARE listed Journal
Publishing by: Dr. Rambhatla Parvatheeswara Sarma, Dr. RVRM Trust, 12-121/17, Flat No. 402, Satyanagar, Chinamusidiwada, Pendurthy, Visakhapatnam-531173. AP, India. +91 9247859580.

AUCHITHYAM UGC-CARE Listed Journal | Volume-4 | Issue-8 | July 2023 | ISSN: 2583-4797

Article Link: https://www.auchithyam.com/2023/jul_2023/full_papers/july23_13.php

# 13. శ్రీమన్మహాభారత శాంతి-అనుశాసనికపర్వాలు: ధర్మానుసరణలో ధర్మజుని వైశిష్ట్యం



**డా. ముళ్ళపూడి బి.ఎస్.ఎస్. నారాయణ**
సంస్కృత సహాయాచార్యులు, భాషాసాహిత్యశాఖ,
ప్రశాంతినిలయం ప్రాంగణం, శ్రీసత్యసాయి విశ్వవిద్యాలయం.
శ్రీసత్యసాయి జిల్లా – 515134, ఆంధ్రప్రదేశ్.
సెల్: +91 9966108560, Email: mullapudibssnarayana@sssihl.edu.in

**వ్యాససంగ్రహం:**

సమస్తవేదవాఙ్మయాన్ని మానవాళికి అందించే ప్రయత్నంలో పంచమవేదమైన భారతేతిహాసాన్ని సంకల్పించారు వ్యాసభగవానులవారు. అందులోనూ శాంతి-అనుశాసనిక పర్వాలలో అపారమైన వేదధర్మాలను కేవలం భీష్మ-ధర్మజుల సంవాదంలోనే బహిర్గతం చేశారు. శివ సహస్రనామాలు, విష్ణు సహస్రనామాలే కాకుండా ఎన్నో స్తోత్రాలను, వేదార్థాలను, మంత్ర వైశిష్ట్యాలను బహిర్గతం చేసిన పర్వాలు శాంతి-అనుశాసన పర్వాలు. ఆశ్రమధర్మాలు, రాజధర్మాలు, మోక్షధర్మాలు .. ఇలా సకల ధర్మముల సారమే ఈ శాంతి అనుశాసనిక పర్వాలు. ఏ పర్వాన్నయినా సంగ్రహంగా చెప్పవచ్చునేమో గానీ, ఈ రెండు పర్వాలలోని అంశాలను ఒక వ్యాసరూపంగా సంగ్రహ పరచుట అనేది, సుధాసాగరము నుండీ ఒక్క బిందువును గ్రహించుటే అవుతుంది. అయినా ప్రయత్న దోషం లేకుండా విషయాసక్తులగుటకు ప్రయత్నిద్దాము.

**Keywords:** యుధిష్ఠిరుడి మనోవ్యథ, వ్యాసభగవానుని హితబోధ, ధర్మజుడు సోదరసమేతంగా పురఃప్రవేశం చేయుట, భీష్మ సమీపమునకు వెళ్ళుట, అంపశయ్య – నేటి విజ్ఞానం, భీష్ముని ఉపదేశామృతం , అనుశాసన పర్వం.

## 1. ఉపోద్ఘాతం:

తన నిమిత్తంగా సమస్త రాజలోకవినాశనం కలిగిందని పరితపిస్తున్న ధర్మజుని మనోవ్యధను దూరం చేయటానికి వ్యాసులవారు విశేషంగా రెండుపర్వాలనే కేటాయించారు. మనోవ్యథను దూరం చేయటానికి నాలుగైదు ఆఖ్యానాలతోనో, ధర్మసూక్ష్మాలతోనో ధర్మజుని శాంతింప చేయవచ్చు కదా? ఇన్ని వందలాది ధర్మాలను శాంతి-అనుశాసన పర్వాలలో వ్యాసులవారు భీష్ముడిచే ధర్మరాజుకి చెప్పించారంటే, దాని అంతరార్థం కేవలం ఇవన్నీ సమస్త మానవాళినీ తరింపచేయటానికి చేసిన ఉపదేశామృతాలుగానే భావించాలి. అనంతమైన, అతిముఖ్యమైన ఈ ఉపదేశామృతాలలో కొన్ని విషయాలను మీ ముందు ఉంచుతున్నాను.

AUCHITHYAM
International Research Journal for Telugu Language & Literary Studies
ISSN: 2583-4797
UGC-CARE listed Journal
Publishing by: Dr. Rambhatla Parvatheeswara Sarma, Dr. RVRM Trust, 12-121/17, Flat No. 402, Satyanagar, Chinamusidiwada, Pendurthy, Visakhapatnam-531173. AP, India. +91 9247859580.

AUCHITHYAM UGC-CARE Listed Journal | Volume-4 | Issue-8 | July 2023 | ISSN: 2583-4797

Article Link: https://www.auchithyam.com/2023/jul_2023/full_papers/july23_13.php

## 2. యుధిష్ఠిరుడి వైరాగ్యం

పాండవుల దగ్గరికి వ్యాసుడు, నారదుడు, కణ్వుడు, వారి శిష్యులు మొదలైన మహాత్ములందరూ వచ్చారు. అందులో నారదమహర్షి ధర్మరాజుతో అంటున్నాడు. "ధర్మజా! శ్రీకృష్ణుని అనుగ్రహంతో విజయం సాధించావు. లోకభయంకరమైన ఈ యుద్ధం నుండీ విముక్తి పొందావు. శత్రువులందరినీ సంహరించావు. ఇక మిత్రులను ప్రజలను జనరంజకంగా పరిపాలించు నాయనా" అన్నాడు.

యుధిష్ఠిరుడు అన్నాడు." ఇంత విజయం సాధించినా నా మనసు కలత పడుతూనే ఉంది మహర్షీ. కుంతీదేవి కర్ణుడి జనన రహస్యాన్ని ఇన్నాళ్ళూ దాచిపెట్టటం అనే విషయం నన్ను చాలా బాధపెడుతున్నది. పైగా ఈ విషయం మా సోదరులకెవరికీ తెలీదు, కానీ కర్ణుడికి తాను కుంతీ కుమారుడినని తెలుసుట. మా తల్లి వెళ్ళి యుద్ధసమయంలో పాండవపక్షాన చేరమని అడిగినా తాను అర్జునుడి చేతిలో చనిపోయాడే కానీ మా వీరసోదరుడు, ఈ రహస్యాన్ని మాత్రం బయటపెట్టలేదు. కర్ణార్జునుల సహాయమే ఉంటే నేను ఇంద్రుడినైనా జయించగలను. అంతే కాదు నారదా, కౌరవసభలలో నేను బాధపడి మానసికంగా కోపోద్రిక్తుడయిన చాలా సందర్భాలలో ఈ **కర్ణుడిని చూడగానే నా కోపమంతా పోయేది" అన్నాడు.ఆ సమయాలలో అనాలోచితంగా ధర్మరాజు దృష్టి కర్ణుడి పాదాలపై పడేదిట. ఆ పాదాలు చూడగానే మా అమ్మ కుంతీదేవి పాదాలులాగే ఉన్నాయే అనుకుంటూ తన కోపాన్నంతా తగ్గించుకునేవాడు ధర్మరాజు.**

తదా నశ్యతి మే రోషః పాదౌ తస్య నిరీక్ష్య హ. 1.41

కుంతీదేవి కూడా ధర్మరాజుని ఓదార్చటానికి ప్రయత్నించింది. "స్వయంగా సూర్యభగవానుడే కర్ణుడికి కలలో కనిపించి చెప్పినా అతను వినలేదు నాయనా. నేను యుద్ధం ముందు వెళ్ళి 'పాండవులు నీ సోదరులు' అని చెప్పినప్పుడు కూడా సూర్యుడు వచ్చి కర్ణుడికి హితవు పలికాడు. ఎంత ప్రయత్నించినా కర్ణుడిని మీ పక్షానికి తీసుకురాలేకపోయాము. అతడు కాలవశుడయ్యాడని, మీతో ఇంకా వైరం పెంచుకోవాలనే అభిలషిస్తున్నాడని ఇక నేను ఊరుకున్నాను. ప్రాజ్ఞుడవైన నీవు శోకాన్ని విడిచిపెట్టు ధర్మరాజా" అని కుంతీదేవి పలికింది. ధర్మరాజు ఆ దుఃఖాన్ని ఆపుకోలేక **సమస్తలోకాలలోని స్త్రీలందరూ ఇకపై రహస్యాలను దాచకుందురుగాక అని శపించాడు.**

**శశాప** చ మహాతేజాః సర్వలోకేషు యోషితః
న గుహ్యం ధారయిష్యన్తీత్యేవం దుఃఖసమన్వితః. 6.11

## 3. వ్యాసభగవానుని హితబోధ:

ఎన్ని విషయాలు విన్నాగానీ, ధర్మరాజు మౌనంగా ఉండి లోలోపల కుమిలిపోతున్నాడు. వేదవ్యాసుడన్నాడు."ధర్మజా! ప్రజలను రక్షించటమే రాజు యొక్క ప్రధాన ధర్మం. యుద్ధంలో వీరులను సంహరించానని బాధపడతున్నావు. తప్పు చేసినవారిని దండించటమే రాజ ధర్మం. అలా చేయని పక్షంలో రాజు ధర్మహంతకుడే అవుతాడు. అలా ధర్మహాని చేస్తున్న పాపాత్ములనందరినీ వారి సేవకులతో సహా నీవు సంహరించి ధర్మాన్ని నిలబెట్టావు. ఇంకా దుఃఖిస్తావెందుకు. ఇదంతా నా వలనే జరిగిందని నీవెందుకు అనుకుంటున్నావు. అన్నిటికీ ఈశ్వరుడే కర్త. అడవిలో చెట్టును గొడ్డలితో నరుకుతున్నప్పుడు ఆ పాపం నరికేవాడిదే కానీ గొడ్డలిది కాదు కదా. అలాగే ఈ జరిగిన కర్మనంతా ఈశ్వరుడి పైనే పెట్టు. నీ ధర్మంలో నీవు ప్రవర్తిస్తున్నావు. అలాంటి నీకు ఆత్మత్యాగం సముచితం

AUCHITHYAM
International Research Journal for Telugu Language & Literary Studies
ISSN: 2583-4797
UGC-CARE listed Journal
Publishing by: Dr. Rambhatla Parvatheeswara Sarma, Dr. RVRM Trust, 12-121/17, Flat No. 402, Satyanagar, Chinamusidiwada, Pendurthy, Visakhapatnam-531173. AP, India. +91 9247859580.

AUCHITHYAM UGC-CARE Listed Journal | Volume-4 | Issue-8 | July 2023 | ISSN: 2583-4797

Article Link: https://www.auchithyam.com/2023/jul_2023/full_papers/july23_13.php

కాదు. ఆయా కర్మలకు ప్రాయశ్చిత్తాలు విధించారు. ప్రాయశ్చిత్తం చేసుకునేవారు మరణసమయంలో ఆ తప్పును గురించి పరితపించరు. మానవుడు వాటిని ఆచరించాలి. అంతేకానీ శరీరాన్ని విడిచిపెట్టాలని అనుకోకూడదు. **అశ్వమేధయాగం చేయడమే దీనికి ప్రాయశ్చిత్తం**. నీ పరాక్రమంతో రాజులందరూ ఓడిపోయారు. నీవు నీ స్నేహితులతోనూ సోదరులతోనూ వారి వారి రాజ్యాలకి వెళ్లి చనిపోయినవారి సోదరులను గానీ పుత్రులను గానీ మనుమలను గానీ వారివారి రాజ్యాలలో అభిషేకించు. **కొడుకులు లేకపోతే కూతుళ్లు ఉంటే వారినే అభిషేకించు. స్త్రీవర్గం సంతోషపడుతుంది**. అంటూ వ్యాసుడు అశ్వమేధయాగం చేసేటప్పుడు చేయవలసిన పనులను కూడా పురమాయిస్తున్నాడు. ఇప్పుడే యుద్ధంలో రాజుల మరణం సంభవించింది కాబట్టి ఆయా రాజ్యాలలో వారి వారసులు ఉండచ్చు. కాబట్టి వారికి పట్టం కట్టటమనేది మంచి చర్య.

ధర్మరాజా! ఇంకా నీవు నీ సందేహాలను నివృత్తి చేసుకోవాలనుకుంటే కురుపితామహుడు వృద్ధుడూ అయిన భీష్ముడి దగ్గరకి వెళ్లు. అతడిప్పుడు నీ ధర్మసందేహాలనన్నీ తీర్చగలడు. అతడు సర్వజ్ఞుడు. ఇంద్రాది దేవతలను దర్శించుకున్నవాడు. బృహస్పతి మొదలైన దేవర్షులను సేవించి రాజనీతినంతా అధ్యయనం చేసినవాడు, పరశురాముడి వద్ద, చ్యవనమహర్షి వద్ద, వశిష్ఠుని వద్ద శిష్యరికం చేసినవాడు, పూర్వం ఇతడు సనత్కుమారునికి శిష్యుడు. వేదవేదాంగాలు తెలిసినవాడు. ఇతనికి తెలియనిదంటూ ఏమీలేదు. ఆయన నీకు అన్ని ధర్మాలు ఉపదేశిస్తాడు. **ఆ ధర్మవేత్త ప్రాణాలు విడవక ముందే అతడిని చేరుకుని నీ సందేహాలు తీర్చుకో మహారాజా"** అని వ్యాసులవారు సెలవిచ్చారు. కానీ ధర్మరాజు ఆయన దగ్గరకు వెళ్లి అడగటానికి సిగ్గు పడ్డాడు. కపటం లేకుండా యుద్ధం చేసే ఆ మహానుభావుడిని శిఖండి నెపంతో యుద్ధంలో పడగొట్టాను. ఇప్పుడాయన దగ్గరకి వెళ్ళి ఎలా నా సందేహాలను ప్రశ్నించగలను? అనుకున్నాడు.

## 4. భీష్మ సమీపమునకు వెళ్ళుట:

శ్రీకృష్ణుని ముందు పెట్టుకుని ధర్మరాజు తన సోదర సమేతంగా కురుక్షేత్రానికి పయనించారు. దూరంగా కనిపిస్తున్న శమంతపంచకాన్ని శ్రీకృష్ణుడు చూపిస్తూ పరశురాముడిచే నిర్మించబడిన నెత్తుటి మడుగులు ధర్మారాజా! వీటినే '**రామహ్రదాలు**' అంటారు, అంటూ పరశురాముడి గురించి చెప్పుకుంటూ, భీష్ముడున్న ప్రదేశానికి చేరుకున్నారు. రథాలు దిగి ఓఘవతీ నదీ తీరంలో అంపశయ్యమీద శయనించి ఉన్న భీష్ముడి దగ్గరికి వెళ్లారు. దగ్గరవుతున్న కొద్దీ వారి మనసులు జారిపోతున్నాయి. శాంతనుడి దగ్గరకి వెళ్ళి అందరూ నమస్కరించి నేలమీద ఆయన పాదాల వద్ద కూర్చున్నారు. కృష్ణుడు దీనమనస్కుడై భీష్ముడి దగ్గరకి వెళ్ళి, "ప్రవాచకోత్తమా! (ఇంక ప్రవచించేదంతా ఆయనే కాబట్టి సమయానికి తగ్గ సంబోధన), నీవు ప్రసన్నంగా ఉన్నావా? నీవు పడుతున్న బాధ ఎలాంటిదో నాకు తెలుసు, నీవు జ్ఞానవృద్ధుడవు, భూతభవిష్యత్ వర్తమానాలన్నీ నీకు తెలుసు. **వసువుల అంశలతో పుట్టిన తొమ్మిదవ వసువువి నీవు**. మహానుభావా జ్ఞాతులందరూ మరణించటంతో ధర్మరాజు దుఃఖంలో కుమిలిపోతున్నాడు. కాబట్టి ధర్మరాజు శోకాన్ని తొలగించు. చాతుర్వర్ణ్యాలవారికీ చతురాశ్రమాలవారికీ చెప్పబడ్డ ధర్మాలన్నీ నీకు తెలుసు. వేదధర్మాలన్నీ నీకు తెలుసు. శిష్టాచారాలు తెలుసు. ధర్మశాస్త్రం నిత్యమూ నీ మనసులోనే ఉంటుంది. పురాణాలన్నీ నీకు అవగతమే. **భీష్మా! నీ జీవితకాలం ఇంకా యాభై ఆరు రోజులు మిగిలి వుంది.**

**పంచాశతం షట్** చ కురుప్రవీర శేషం దినానాం తవ జీవితస్య.51,14

AUCHITHYAM
International Research Journal for Telugu Language & Literary Studies
ISSN: 2583-4797
UGC-CARE listed Journal
Publishing by: Dr. Rambhatla Parvatheeswara Sarma, Dr. RVRM Trust, 12-121/17, Flat No. 402, Satyanagar, Chinamusidiwada, Pendurthy, Visakhapatnam-531173. AP, India. +91 9247859580.

AUCHITHYAM UGC-CARE Listed Journal | Volume-4 | Issue-8 | July 2023 | ISSN: 2583-4797

Article Link: https://www.auchithyam.com/2023/jul_2023/full_papers/july23_13.php

తరువాత ఉత్తమలోకాలను చేరుకుంటావు. కాబట్టి ఇప్పుడు శోకంలో పరితపిస్తున్న ధర్మరాజు శోకాన్ని నీ బుద్ధిబలంతో తీసివేసి కర్తవ్యాన్ని బోధించు" అన్నాడు. పైగా ఇక్కడ ఇంకో విషయం ఉంది. **కురుసింహాసనం మీద ఎవరు ఉంటే వారి రక్షణ భాధ్యత తాను జీవించినంతకాలం వహిస్తానని ప్రతిజ్ఞ చేశాడు భీష్ముడు. ఇప్పుడు ధర్మరాజు రాజయ్యాడు. కాబట్టి ఆ రాజు యొక్క శోకం పోగొట్టి కర్తవ్యాన్ని నిర్వర్తింపచేయటం అనేవిషయంలో, భీష్ముడు పరమపదిస్తూ కూడా తన భాధ్యతను నిర్వర్తించాడని కూడా మనం గమనించవచ్చు.**

## 5. అంపశయ్య – నేటి విజ్ఞానం

అంపశయ్య మీద ఉన్న పితామహుని మనం గమనిస్తే ఎన్నో విషయాలు తెలుసుకోవచ్చు. మహాభారతంలోని ప్రతి అంశమూ ఈ నాటి నిత్యజీవితంలో మనం చూస్తున్న విషయాలతో పోల్చుకుని చూస్తే, ఈ నాటివన్నీ ఆనాటి భారతంలోనే చేసి చూపించారు కదా అని ఆశ్చర్యపోతాము. **భీష్ముని దగ్గరకి వచ్చి ధర్మరాజు ధర్మాలు అడగటం** కూడా పెద్దల జీవితానుభవాలనుండీ మనం మన జీవిత విజయావకాశాలను వృద్ధి చేసుకోవటమే. నేడు చాలా రంగాలలో పెద్దల సలహా తీసుకోవటం అనే అంశం ప్రముఖంగా కనిపిస్తుంది. **అనుభవజ్ఞులైన పెద్దవారు ఇచ్చిన సలహాల మేర అనేక రంగాలు విజయపథాన** నడుస్తున్నాయి. అదే ఆనాడు ధర్మరాజు చేసినది కూడా.

భీష్ముడు అంపశయ్యమీద పడిపోగానే వేలాది మంది సేవకులు **వచ్చి ఆ ప్రదేశాన్ని శుభ్రం చేసి గంధపు పొడి చల్లి, పూలతో అలంకరించి ఆయనకు మంచి వాయువులు వచ్చే విధంగా ఏర్పాటు చేశారు**. ఆకాశం నుండే పుష్పవృష్టి కురిసింది. నేటి కాలంలో వైద్యశాలలు చూడండి. రోగి గదిని శుభ్రపరచటం లాంటి పద్ధతులు వారి పరిసరాలు ఎలా ఉండాలో అనేది ఆనాటి కాలంలో జరిగిందే. ఆయుర్వేదం లాంటివాటిలో చెప్పిన పుష్పవైద్యం లాంటి అంశాలు కూడా ఇక్కడ జరిగిన పుష్పవృష్టిలో మనం అన్వయించుకోవచ్చు. ఇంకా భీష్ముడి దగ్గరికి సంగీతకారులు, నాట్యకారులు, గాయకులు మొదలైన వారుకూడా చేరుకున్నారు. ఆయన మనసుని సంతోష పరచటానికి. కానీ భీష్ముడు వారందరినీ తిరస్కరించాడు. ఎందుకంటే ఆయన ఈ భోగాలకు అతీతుడయ్యాడు. నేడు కూడా ఈ 'మ్యూజిక్ థెరఫీ' అనేది కూడా రోగుల రోగాలను నయం చేస్తుంది అని మనం వింటూనే ఉన్నాం. అది ఆనాటిదే అని మనం గమనించాలి.

అలాగే సమయపాలన గురించి కూడా ఒక విషయం చెప్పుకోవచ్చు. పాండవులు అక్కడే భీష్ముడి దగ్గర అవిశ్రాంతంగా లేరు. సూర్యోదయం అయ్యాక వారి వారి సంధ్యావందనాలు చేసుకుని వచ్చారు. మరలా మధ్యాహ్న సంధ్యలకు విరామం ఇచ్చారు. సాయంసంధ్యా సమయంలో తిరిగి వారి వారి భవనాలుకు చేరుకున్నారు. అంటే నేడు మనం వైద్యశాలలలో రోగి దగ్గరకు వెళ్లటానికి కూడా ఒక సమయం ప్రకారం గానీ, లేదా వైద్యులు సూచించిన సమయంలో గానీ వెళ్లి చూసి వస్తూంటాం. అలాంటి నేటి పద్ధతి, భారత కాలంలోనే మనం గమనించవచ్చు. పైగా **రోగి దగ్గరికి ఎలా వెళ్ళాలి? ఎంతమంది వెళ్ళాలి?** అనే విషయాలు కూడా మనకు అవగతమవుతాయి. పాండవులు వారి వారి **సర్వసైన్యాలను దూరంగా వదిలి పెట్టి, కేవలం కొద్దిమందితో మాత్రమే భీష్ముడి దగ్గరకి చేరుకున్నారు**. ఎక్కువమంది వలన, మరలా వారి వాహనాలతో లేచిన ధూళితో పితామహుడికి ఇబ్బంది కలుగుతుంది. అందుకే పాండవులు కూడా వారి వాహనాలను దూరంగా విడిచి **పాదచారులై పితామహుడి పాదాల వద్ద కూర్చున్నారు**. అంటే **కాలుష్యనివారణ**

AUCHITHYAM UGC-CARE Listed Journal | Volume-4 | Issue-8 | July 2023 | ISSN: 2583-4797

Article Link: https://www.auchithyam.com/2023/jul_2023/full_papers/july23_13.php

**చర్యలు ఆనాటివే. శ్రీకృష్ణుడు దారుకుడితో తన రథాన్నికూడా శబ్దం చేయకుండా పోనీయమన్నాడు.** ఇలాంటి జాగ్రత్తలన్నీ మనం గమనిస్తుంటే భారతంలో లేనిది, చెప్పనిది ఏదీలేదు. "యదిహాస్తి తదన్యత్ర, యన్నేహాస్తి న తత్ క్వచిత్".

## ౬. భీష్ముని ఉపదేశామృతం

తరువాత పితామహునితో శ్రీకృష్ణుడన్నాడు- "జ్ఞాతులందరూ తన వలన చనిపోయారనే అభిశాపభయంతో ధర్మరాజు సిగ్గుపడుతూ, లోకనిందకి వెరచి నీ దగ్గరకి రాలేకపోతున్నాడు. అతడికి సమయోచితమైన ధర్మాలను చెప్పు పితామహా"! అని కృష్ణుడు పలకగానే, భీష్ముడు ధర్మరాజుకి వినబడేలా వివరణ ఇచ్చాడు. "దానం అధ్యయనం తపస్సు బ్రాహ్మణులకు ధర్మమైనట్టే క్షత్రియులకు యుద్ధంలో దేహం విడవటం ధర్మం. **తండ్రులు తాతలు సోదరులు గురువులు బంధువులు ఎవరైనా సరే, చెడు మార్గంలో నడిస్తే వారిని యుద్ధంలో చంపవచ్చు అదే ధర్మం**, అని భీష్ముడు చెప్పగానే ధర్మరాజు ముందుకు వచ్చి పితామహుడికి వినయంగా పాదాభివందనం చేసి ఆయన ఆజ్ఞతో పక్కనే చూపుకు అందేటట్టు కూర్చున్నాడు. "నాయనా! ఇక నా నుండీ నీవు ఏది తెలుసుకోవాలనుకుంటున్నావో అది నిర్భయంగా అడిగి సందేహనివృత్తి చేసుకో" అన్నాడు. ఇక ఇక్కడ నుండీ ధర్మరాజు సకల ధర్మాలూ పితామహుడి వద్ద సవివరంగా అడిగి తెలుకున్నాడు

భీష్ముని ప్రోత్సాహంతో ధర్మరాజు అహం భో అభివాదయే అని నమస్కరించి, తన సందేహాలను మొదలు పెట్టాడు. అందులో **మొదట ధర్మం గురించే చెప్పమన్నాడు**. రాజులకు, ధర్మవేత్తలకు ధర్మమే గొప్పదంటారు కదా, దానిగురించి చెప్పు తాతా అని అడిగాడు. అందులో ముందుగా నా కోసం **రాజధర్మాలను** ఉపదేశించు అనగానే భీష్ముడు ప్రారంభిస్తున్నాడు.

నమో ధర్మాయ మహతే నమః కృష్ణాయ వేధసే
బ్రాహ్మణేభ్యో నమస్కృత్య ధర్మాన్వక్ష్యామి శాశ్వతాన్. 56.10

గొప్పదైన ధర్మానికి నమస్కరించి, కృష్ణుడికి నమస్కరించి, తరువాత బ్రహ్మతత్వం తెలిసిన బ్రాహ్మణులకు నమస్కరించి శాశ్వతములైన ధర్మాలను చెబుతాను ధర్మజా! "కార్యసిద్ధికి ఎప్పుడూ పురుషప్రయత్నంతోనే ప్రయత్నించాలి. పురుషప్రయత్నం లేకుండా దైవం కూడా ఏదైనా పని మధ్యలో అవాంతరాలవలన ఆగిపోయినా బాధపడకుండా నిత్యమూ దాని కోసం ప్రయత్నించాలి. ఇదే రాజులకు ఉత్తమమైన నీతి. శుక్రాచార్యుడు చెప్పిన దాని ప్రకారం – ఆయుధం పట్టుకుని వస్తున్నవాడు ఎంత వేదాంతవేత్త అయినా సరే రాజు అనేవాడు వానిని స్వధర్మంతో నిగ్రహించాలి. నశించిపోతున్న ధర్మాన్ని రక్షించినవాడే ధర్మవేత్త. అలా రక్షించటంలో హింస జరిగినా ధర్మహాని కాదు. వివేకం కల రాజు చాతుర్వర్ణ్యాలవారినీ దయతో చూడాలి. అలా అని **అన్ని సందర్భాలలో సహనం పాటించరాదు**. అన్ని అపరాధాలనూ సహిస్తూ ఏనుగువలే మృదువుగా ఉండే రాజు ధర్మవిరోధి అవుతాడు. ఈ విషయంలో బృహస్పతి చెప్పిన శాస్త్రవాక్యం ఏమిటంటే- నిత్యమూ క్షమించే రాజును, నీచుడు కూడా అవమానిస్తాడు. అందు చేత **మరీ మృదువుగా ఉండకూడదు, మరీ తీవ్రంగానూ ఉండకూడదు**. వసంతఋతువులో సూర్యుడు చల్లగానూ, వేడిగానూ కాకుండా ఎలా ఉంటాడో అలా రాజు ప్రవర్తించాలి. రాజు తన వ్యసనాలన్నీ విడిచిపెట్టాలి. గర్భవతి అయిన స్త్రీ తనకు ప్రియమైనవి వదిలిపెట్టి కడుపులోని బిడ్డకు ఏది హితమైనదో అదే గ్రహిస్తుంది. అలాగే రాజుకూడా తన హితాన్ని వదిలి **ప్రజలకు ప్రకృతికి హితమైనదే చేయాలి**. తగినటువంటి దండనీతితో లోకానికి స్పష్టంగా తెలిసేట్టు ప్రవర్తించే రాజుకి ఎక్కడా భయం ఉండదు. రాజు ఎల్లప్పుడూ ప్రయత్నపరుడై ఉండాలి ధర్మరాజా, ఈ విషయంలో **శుక్రాచార్యుడు** చెప్పిన శ్లోకం ఒకటి ఉంది.

AUCHITHYAM
International Research Journal for Telugu Language & Literary Studies
ISSN: 2583-4797
UGC-CARE listed Journal
Publishing by: Dr. Rambhatla Parvatheeswara Sarma, Dr. RVRM Trust, 12-121/17, Flat No. 402, Satyanagar, Chinamusidiwada, Pendurthy, Visakhapatnam-531173. AP, India. +91 9247859580.

AUCHITHYAM UGC-CARE Listed Journal | Volume-4 | Issue-8 | July 2023 | ISSN: 2583-4797

Article Link: https://www.auchithyam.com/2023/jul_2023/full_papers/july23_13.php

ద్వావిమౌ గ్రసతే భూమిః సర్పో బిలశయానివ
రాజానం చావిరోద్ధారం బ్రాహ్మణం చాప్రవాసినమ్". 57.3

ఈ విధంగా రాజధర్మాలు ప్రస్తావిస్తుండగా సూర్యాస్తమయం అయింది. ధర్మరాజు తాతగారికి నమస్కరించి ఆయన ఆజ్ఞతో హస్తినకు ప్రయాణమయ్యారు. దారిలో **దృషద్వతీ** నదిలో స్నానం చేసి సూర్యుడికి అర్ఘ్యమిచ్చి సంధ్యావందనం ముగించుకుని హిస్తినకు చేరుకున్నారు. రాత్రి సుఖంగా నిద్రించి మరునాడు తిరిగి భీష్ముడిని చేరుకున్నారు.

ధర్మరాజు అడుగుతున్నాడు. "పితామహా! నాకు **మోక్ష మార్గము ఉపదేశించు**" అని కోరాడు. భీష్ముడు" ధర్మనందనా ! **వార్ణేయ అధ్యాత్మము** అను కథ ఒకటి ఉన్నది. అందులో నీకు తగిన సమాధానము దొరుకుతుంది. పూర్వము వార్ణేయుడు అనే పేరుగల ఒక మునీశ్వరుడు ఉండే వాడు. ఒక రోజు అతడిని అతడి శిష్యుడు నమస్కరించి "గురువర్యా ! మీరు నాకు మోక్షమార్గము ఉపదేశించండి " అని అడిగాడు. అందుకు **వార్ణేయుడు** " కుమారా ! నీకు భక్తి, జ్ఞానము సమృద్ధిగా ఉన్నాయి. నీవు మోక్షమార్గము ఉపదేశము పొందుటకు అర్హుడవు. కనుక సావధానముగా విను. ప్రకృతి పురుషుల సమ్మేళనంగా చైతన్యము ఉద్భవించింది. ఆ చైతన్యము నుండి బుద్ధి, బుద్ధి నుండి అహంకారము, అహంకారము చిత్తమును ఆశ్రయించి ఉంటుంది. అహంకారము నుండి ఆకాశము, ఆకాశము నుండి వాయువు, వాయువు నుండి తేజస్సు, తేజస్సు నుండి జలము, జలము నుండి భూమి పుట్టాయి. బుద్ధిని మహత్వము అంటారు. మహత్వము నుండి ఐదు జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు ఐదు, వీటితో శబ్ధ, స్పర్శ, రూపము, రుచి, గంధము అను అయిదు వాటితో మనస్సును చేర్చి పదహారు వికృతులు ఏర్పడినాయి. కుమారా ! **శరీరము తొమ్మిది ద్వారములు కలిగిన పుణ్యనగరము**. ఈ నగరంలో ఊహకందని రీతిలో పరమాత్మ వ్యాపించి ఉంటాడు. ఆ పరమాత్మను పురుషుడు అంటారు. ఆ పురుషుడు అమరుడు, అవ్యయుడు, అజరుడు, అమేయుడు, అమలుడు. చెట్టునందు దాగి ఉన్న అగ్నిలా పురుషుడు జీవిలలో అవ్యక్తంగా ఉన్నాడు. ఎండిన చెట్లు రాచుకున్నప్పుడు చెట్టు నుండి నిప్పు పుట్టిన విధంగా **జ్ఞానాగ్నిలో ధగ్ధుడైన మానవుడు యోగముతో మనస్సును మధించిన పరమాత్మను కనుగొనగలడు**. ఈ పురుషుని ఉనికివలననే ప్రాణులు చూచుట, వాసన చూచుట, స్పర్శజ్ఞానము, రుచి తెలుసుకొనుట వంటివి తెలుసుకుంటాము. కుమారా! ఈ భూతకోటి అవ్యక్తము నుండి వ్యక్తము ఔతాయి, జీవిస్తున్నాయి, నశిస్తున్నాయి. పుట్టడము, పెరగడము, నశించడము వీటికి పురుషుడు సాక్షీభూతుడు. ఈ కాలచక్రముకు అంచులు ఏడు. దానికి అవ్యక్తము కేంద్రము. ఆ చక్రము చుట్టూ పదహారు వలయాలు ఆవరించి ఉంటాయి. వాటి మీద పురుషుడు అధిష్టించి ఉంటాడు. మానవుడు త్రిగుణములకు లోబడి నడుచుకుంటాడు. విజ్ఞుడు వాటికి లోబడక వివేకంతో నడచుకుంటాడు. ప్రవృత్తి కార్యములు చేస్తూ ఉన్న దేహాభిమానము వదలని వారు కామ క్రోధమును విడువ లేరు. కనుక విజ్ఞులు దేహముపై అభిమానమును వదిలివేయాలి. అరణ్యము వంటి ఈ సంసారములో మానవుడు అత్యంత కుతూహలముతో తిరుగుతూ ఉంటాడు. ఎంత ప్రయాణించినా అవతలి ఒడ్డు చేరలేడు. శరీరానికి వచ్చిన రోగమును ఔషధ సేవనముతో నయము చేసుకున్నట్లు **దేహాభిమానము పోవడానికి సత్యము, శౌచము, శమము, దమము పాటించాలి**. స్మృతి, సంప్రీతి, ప్రసన్నత మొదలైనవి సత్వగుణము వలన జనిస్తాయి. రాగము, ద్వేషము, మోహము, లోభము రజోగుణ ఉత్పన్నములు. దర్పము, శోకము తామసగుణ ఉత్పన్నములు. జ్ఞానసముపార్జనకు ఈ మూడు గుణములు అవరోధములే అయినా మానవుడు ముందు **రజో, తామస గుణములను విడిచి వేసి మనస్సును సత్వగుణ ప్రధానము చేయాలి**. సత్వగుణము జ్ఞానసముపార్జనకు తోడ్పడుతుంది. మానవుడు అహంకారముతో చేసే పనులవలన మానవుడికి వెలుపలి ప్రపంచబంధము ఏర్పడుతుంది. అది పునర్జన్మకు కారణ మౌతుంది. స్త్రీగర్భములో రూపుదిద్దుకున్న పిండము నవమాసములు పొర్లుతూ

AUCHITHYAM
International Research Journal for Telugu Language & Literary Studies
ISSN: 2583-4797
UGC-CARE listed Journal
Publishing by: Dr. Rambhatla Parvatheeswara Sarma, Dr. RVRM Trust, 12-121/17, Flat No. 402, Satyanagar, Chinamusidiwada, Pendurthy, Visakhapatnam-531173. AP, India. +91 9247859580.

AUCHITHYAM UGC-CARE Listed Journal | Volume-4 | Issue-8 | July 2023 | ISSN: 2583-4797

Article Link: https://www.auchithyam.com/2023/jul_2023/full_papers/july23_13.php

బయట ప్రపంచానికి వచ్చి ఈ సంసారబంధాలలో చిక్కుకుని దు:ఖసాగరంలో మునిగి పోతున్నాడు. ఈ సంసార బంధానికి మూలము ఆశ తీగ. ఆ తీగ స్త్రీ అనే కొయ్యకు చుట్టుకుని పాకుతూ ఉంటుంది. ఆశ అనే తీగను ఆదిలోనే తుంచి మోక్షమును పొందాలి. అని పితామహుడు ప్రవచించాడు.

ఈ విధంగా భీష్ముడు ధర్మరాజుకి **జీవరహస్యం** గురించి , సదాచారవ్యవహారాల గురించి, అనేక ప్రాయశ్చిత్తాల గురించి, ధ్యానయోగం గురించి, పంచభూతముల తత్వాల గురించి, వృక్షతత్వాల గురించి, శమదమాదుల గురించి, ఉపవాసము, బ్రహ్మచర్యాదుల గురించి సవివరంగా వివరించాడు. తరువాత ధర్మరాజు మరో ప్రశ్న వేశాడు. పితామహా, **మోక్షకాముకులు మరణ సమయంలో ఏ మంత్రం జపించాలి?** మరణసమయంలో మానవుడు దేన్ని స్మరిస్తే పరమసిద్ధిని పొందుతాడో నాకు తెలుపు అని ప్రార్థించాడు. భీష్ముడు సమాధానం వివరిస్తూ, పూర్వం నారదుడు విష్ణుమూర్తిని ఇదే ప్రశ్న అడిగాడు. భగవంతుడైన విష్ణువు నారదుడితో, "నీకు దివ్యమైన అనుస్మృతి చెబుతాను. దీనిని మరణసమయంలో విన్నవాడు నారూపాన్ని నా భావాన్ని పొందుతాడు. ఓం నమో భగవతే తస్మై దేహినాం పరమాత్మనే/ నారాయణాయ భక్తానామేకనిష్ఠాయ శాశ్వతే./ ఇమామనుస్మృతిం దివ్యాం వైష్ణవీం సుసమాహితః. 209. ఓంకార పూర్వకంగా నాకు నమస్కరించి, **ఏకాగ్రతతో "ఓం నమో భగవతే వాసుదేవాయ" అనే ద్వాదశాక్షర మంత్రాన్ని పఠించాలి" అని** శ్రీమన్నారాయణుని ఉపదేశాన్ని వివరించాడు భీష్ముడు. భీష్ముడు **ఆశ్రమధర్మాలను** వివరిస్తూ, బ్రహ్మచారి అయినా, గృహస్థుడయినా, వానప్రస్థుడైనా, సన్యాసి అయినా ఆయా ఆశ్రమధర్మాలను, వారు పాటిస్తే పరమగతిని పొందుతారు.

బ్రహ్మచారీ గృహస్థశ్చ వానప్రస్థోऽథ భిక్షుకః/ యథోక్తచారిణః సర్వే గచ్ఛన్తి పరమాం గతిమ్. 242.13

ఈ నాలుగు ఆశ్రమాలలో ఏ ఒక్కదాన్నయినా యథాశాస్త్రంగా, రాగద్వేషాలు లేకుండా పాటించగలిగినవాడు పరమాత్మజ్ఞానాన్ని పొందుతాడని వ్యాసుడు తన కుమారుడైన శుకుడికి ఉపదేశం చేశాడు. పరబ్రహ్మ ప్రాప్తికై ఈ నాలుగు ఆశ్రమాలు నాలుగు మెట్లు కలిగిన నిచ్చెనలాంటిది. వ్యాసుడు నాలుగు ఆశ్రమాలను వివరించాడు ఈ సందర్భంలో.

తరువాత **మరణం సమయంలో ప్రాణాలు ఏ అంగాలనుండీ బయటకు పోతే ఆ జీవుడు ఏయే లోకాలకు వెళతాడో** చెప్పారు. పాదాలు నుండి ప్రాణాలు పోయే వ్యక్తి విష్ణులోకానికి చేరుకుంటాడు. పిక్కలనుండీ పోతే వసులోకానికి, శరీరంలోని కుడి ఎడమ భాగాల నుండి పోతే మరుత్తుల లోకానికి, బొడ్డు నుంచి పోతే ఇంద్రస్థానానికి, వక్షస్థలం నుండి పోతే రుద్ర లోకానికి వెళతాడు. ముఖం నుండి పోతే విశ్వేదేవతల లోకానికి, కనులు నుండి పోతే అగ్ని దేవుని లోకానికి, నుదుటి నుండి పోతే పితృదేవతల లోకానికి, ఆ జీవుడు చేరుకుంటాడు. శిరోభాగం నుంచి ప్రాణం పోతే ఆ జీవుడు బ్రహ్మ లోకానికి చేరుకుంటాడు.

అలాగే ప్రాణాలు ఈ శరీరాన్ని వదలటానికి సరిగ్గా **సంవత్సరం ముందు నుంచే మృత్యుసంకేతాలు**, అరిష్టసూచకాలు కనిపిస్తాయని శాస్త్రం చెబుతోంది.

అరిష్ఠాని ప్రవక్ష్యామి విహితాని మనీషిభిః/ సంవత్సర వియోగస్య సంభవన్తి శరీరిణః. 317.8

అవేమిటంటే, **అంతకుముందు చూసిన అరుంధతి నక్షత్రాన్ని, ధ్రువ నక్షత్రాన్ని చూడలేరు. పూర్ణ చంద్రబింబాన్ని చూడలేరు.అలాగే దీపం జ్వాల కుడివైపు మాత్రమే కనిపించి ఎడమవైపు ఖండితమైనట్లు కనిపిస్తే ఆ వ్యక్తి సంవత్సరం మాత్రమే జీవిస్తాడు.** యోऽరున్ధతీం న పశ్యేత దృష్టపూర్వాం కదాచన/ తథైవ ధ్రువమిత్యాహుః పూర్ణేందుం దీపమేవ చ.9/ ఖండాభాసం దక్షిణతస్తేऽపి సంవత్సరాయుషః. ఎదుటివారి కనుపాపలలో తన ప్రతిబింబాన్ని చూడలేని వారు సంవత్సరం మాత్రమే జీవిస్తారు.వ్యక్తిలోని తేజస్సు తగ్గిపోయినా, స్వభావంలో బాగా తేడాలు కలిగినా ఆ వ్యక్తి కి ఆరు నెలల్లోనే మరణం సంభవిస్తుంది.

AUCHITHYAM
International Research Journal for Telugu Language & Literary Studies
ISSN: 2583-4797
UGC-CARE listed Journal
Publishing by: Dr. Rambhatla Parvatheeswara Sarma, Dr. RVRM Trust, 12-121/17, Flat No. 402, Satyanagar, Chinamusidiwada, Pendurthy, Visakhapatnam-531173. AP, India. +91 9247859580.

AUCHITHYAM UGC-CARE Listed Journal | Volume-4 | Issue-8 | July 2023 | ISSN: 2583-4797

Article Link: https://www.auchithyam.com/2023/jul_2023/full_papers/july23_13.php

పరచక్షుషి చాత్మానం యే న పశ్యన్తి పార్థివ/ ఆత్మచ్ఛాయాకృతీభూతం తేకపి సంవత్సరాయుషః .10
శరీరచ్ఛాయ పాలిపోయినా, దేవతలను నిందించిన వారు ఆరు నెలల్లోనే మరణిస్తారు. సూర్య చంద్ర బింబాలలో రంధ్రం కనిపించినా, దేవాలయాలలోని సుగంధం దుర్వాసనగా అనిపించే వాడు ఏడు రోజులే జీవిస్తాడు. అకస్మాత్తుగా ఎడమ కంటినుండీ నీరు కారటం, శరీరం చల్లబడటం, శిరసు నుండి ఆవిరి వస్తున్నా ఇవన్నీ మృత్యు సంకేతాలే, అందువల్ల ఈ సంకేతాలను తెలుసుకుని మనసును పరమాత్మ వైపు మరల్చుకోవాలి. నిశి చాహని చాత్మానం యోజయేత్ పరమాత్మని. 17. ఈ విధంగా భీష్ముడు **మరణం సంభవించే సమయంలో కనిపించే సూచనలు** ధర్మరాజుకు వివరించాడు.

## 8. అనుశాసన పర్వం.

శాంతిపర్వంలో 365 అధ్యాయాలతో అనేక ధర్మవిషయాలను ఉపదేశించిన భీష్ముడు అనుశాసన పర్వంలోకూడా అనేక ధర్మసూక్ష్మాలను యుధిష్ఠిరునికి ఉపదేశించాడు. యుధిష్ఠిరుడు అడుగుతున్నాడు. తాతా! **ఎటువంటి స్త్రీ పురుషులలో లక్ష్మి నిత్యమూ నివసిస్తుంది ?** అని అడిగాడు. కీద్రుశే పురుషే తాత స్త్రీషు వా భరతర్షభ, శ్రీః పద్మా వసతే నిత్యం తన్మే బ్రూహి పితామహ. 11, 1
ఈ ప్రశ్నకి భీష్ముడు, శ్రీకృష్ణుడి సమక్షంలోనే ఒకసారి రుక్మిణీదేవి స్వయంగా లక్ష్మీదేవిని ఈ ప్రశ్న అడిగింది. లక్ష్మీదేవి ప్రసన్నమయి మధురమైన వాక్కులతో చెప్పనారంభించింది. (ఆవిడ చెప్పిన విషయమేమిటంటే) **నిత్యమూ సౌభాగ్యవంతుడై, భయరహితుడై, సమర్థుడై, క్రోధరహితుడై, దైవభక్తుడై, కృతజ్ఞుడై, జితేంద్రియుడై, సత్వగుణ సహితుడై, కర్మతత్పరుడైన నరుడి దగ్గర లక్ష్మీదేవి నివసిస్తుంది.** ఈ గుణాలకు భిన్నంగా ఉండేవాని వద్ద ఉండదు. స్వధర్మ పరాయణులు, వృద్ధసేవాతత్పరులు, మనస్సును అదుపులో పెట్టుకున్నవారు, సహనశీలుడు, క్షమాశీలుడు, దమనశీలుడు, ఋజువర్తనంతో కూడినవారు, దైవ బ్రాహ్మణులను పూజించేవారి దగ్గర లక్ష్మీదేవి నివసిస్తుంది. స్వధర్మశీలేషు చ ధర్మవిత్సు వృద్ధోపసేవానిరతే చ దాన్తే/ కృతాత్మని క్షాన్తిపరే సమర్థే క్షాన్తాసు దాన్తాసు తథాऽ**బలాసు.**11.10 (క్షమా గుణాదులతో ఇంద్రియ నిగ్రహం కలిగిన స్త్రీలలో కూడా లక్ష్మీదేవి నివసిస్తుంది.)
అలాగే సద్గుణాలు కలిగి, దైవ బ్రాహ్మణులను సేవిస్తూ, ఇంటిని, ఇంటి పాత్రలను వస్తువులను శుభ్రంగా ఉంచుకునే స్త్రీలవద్ద, గోవులపై, ధాన్యంపై ఆసక్తి కల స్త్రీల వద్ద నేను నివసిస్తాను. సత్యవాదిని, సౌభాగ్యవతి, శుభాచారవతి, అలంకారవతి, పతివ్రత అయిన స్త్రీ వద్ద లక్ష్మీదేవి నివసిస్తుంది. వసామి స్త్రీషు కాన్తాసు దేవద్విజపరాసు చ / విశుద్ధ గృహ భాండాసు గోధాన్యాభిరతాసు చ. 11.11

ఇంట్లో పాత్రలను చెల్లాచెదురుగా ఉంచేవారు, ఆలోచించకుండా పని చేసేవారు, నిత్యమూ భర్తకు ప్రతికూలంగా మాట్లాడేవారు, సిగ్గువిడిచినవారు, ఇతరుల ఇండ్లపై, వారి విషయాలపై ఆసక్తి చూపేవారు, ఇటువంటి స్త్రీలను లక్ష్మీదేవి పరిహరిస్తుంది. పాపపు పనులు చేసేది, శుభ్రత లేనిది, తిండిపోతు, ధైర్యంలేనిది, కలహప్రియురాలుగా ఉండేది, నిద్రకు వశమైపోయేది, ఇటువంటి లక్షణాలు గల స్త్రీని లక్ష్మీదేవి పరిహరిస్తుంది.
తరువాత యుధిష్ఠిరుడు పితామహుడిని **మంగళప్రదములైన పరమేశ్వరుడి నామాలను చెప్పమని కోరుకున్నాడు**. దానికి భీష్ముడు, నాయనా! ఆ మహాదేవుని గుణాలను వివరించటానికి నేను అశక్తుడిని, ఆయన ప్రకృతికి అతీతుడు. ఆయన గురించి వర్ణించటానికి మానవులు సమర్థులు కారు. అశక్తోऽహం గుణాన్ వక్తుం మహాదేవస్య ధీమతః 14.3
శంఖచక్రగదాధారియైన నారాయణుడు మాత్రమే పరమేశ్వరుడి గురించి చెప్పగలడు. ధర్మరాజా! రుద్రునిమీద భక్తితోనే కృష్ణుడు విశ్వమంతా వ్యాపించగలిగాడు. గతంలో బదరీవనంలో రుద్రుడిని ప్రసన్నం చేసుకున్నాడు.

AUCHITHYAM
International Research Journal for Telugu Language & Literary Studies
ISSN: 2583-4797
UGC-CARE listed Journal
Publishing by: Dr. Rambhatla Parvatheeswara Sarma, Dr. RVRM Trust, 12-121/17, Flat No. 402, Satyanagar, Chinamusidiwada, Pendurthy, Visakhapatnam-531173. AP, India. +91 9247859580.

AUCHITHYAM UGC-CARE Listed Journal | Volume-4 | Issue-8 | July 2023 | ISSN: 2583-4797

Article Link: https://www.auchithyam.com/2023/jul_2023/full_papers/july23_13.php

యుగే యుగే తు కృష్ణేన తోషితో వై మహేశ్వరః / భక్త్యా పరమయా చైవ ప్రీతశ్చైవ మహాత్మనః 14.13

**దేవదేవుని నామాలు వర్ణించటానికి అచ్యుతుడే సరైన వాడు.** అని ధర్మరాజుతో పలికి భీష్ముడు వాసుదేవునితో, కృష్ణా! యుధిష్ఠిరుడు అడిగిన ఈ ప్రశ్నకి నీవే సమాధానం చెప్పగలవు. నీ నుండీ మేమందరం సంతోషంగా, ఈ నాడు మహేశ్వరుడి దివ్యనామాలు తెలుసుకుంటాము. దయచేసి చెప్పు కృష్ణ అని వేడుకున్నాడు. ఆ సందర్భంలో కృష్ణుడు ప్రసన్నుడై, ఆచమనం చేసి పవిత్రుడై **శివసహస్రనామాలను** ఉపదేశించాడు.

భీష్మడి ద్వారా విని యుధిష్ఠిరుడు మరలా ప్రశ్నిస్తున్నాడు. అసలు **ఈ లోకానికంతటికీ మార్గదర్శకం ఎవరు? ఎవరిని స్తోత్రం చేయటం వలన మానవులు సమస్త శుభాలనూ పొందుతారు. ఏ స్తోత్రాన్ని జపిస్తే జన్మసంసార బంధలనుండీ విముక్తి లభిస్తుందో** నాకు వివరించండి అని పితామహుడిని ప్రార్థించాడు. కిమేకం దైవతం లోకే కిం వాప్యేకం పరాయణమ్. స్తువన్తః కం కమర్చన్తః ప్రాప్నుయుర్మానవాః శుభమ్.149.2/ కోధర్మః సర్వధర్మాణాంభవతః పరమోమతః./కిం జపన్ ముచ్యతే జన్తుర్జన్మసంసారబన్ధనాత్. 3

ఈ సందర్భంలో భీష్ముడు పరమపావనమైన విష్ణుసహస్రనామాలను ఉపదేశించాడు. సమస్త ప్రపంచానికి ప్రభువు, ఇంద్రాదులకూ దేవుడు, అనంతుడు, పురుషోత్తముడు అయిన విష్ణువును వేయి నామాలతో స్తుతించిన మానవుడు నిరంతరం అభ్యుదయాన్ని పొందుతాడు. యుగారంభంలో ఆయన నుండే సమస్త ప్రాణులూ ఉద్భవిస్తాయి. తిరిగి యుగాంతంలో ఆయనలోనే లయిస్తాయి. మహర్షుల చేత పదేపదే కీర్తింపబడే విష్ణుసహస్రనామాలను పరమైశ్వర్యసిద్ధికోసం నీకు చెప్తాను విను మహారాజా అంటూ భీష్ముడు **శ్రీవిష్ణు సహస్రనామాలను** ఉపదేశించాడు. ఓం విశ్వం విష్ణుర్వషట్కారో భూతభవ్యభవత్ప్రభుః/ భూతకృద్ భూతభృద్ భావో భూతాత్మా భూతభావనః. 149.14. విరాట్రూపుడు, అంతటా వ్యాపించినవాడు, యజ్ఞస్వీకర్త, త్రికాలాధీశుడు, సకల ప్రాణులను సృష్టించినవాడు, ప్రాణులను భరించేవాడు, సమస్త భూతాలకు అంతర్యామి, భూతాభివృద్ధికారకుడు, అంటూ ఈ విధంగా మొదలుపెట్టి - శంఖభృన్నందకీ చక్రీ శార్ఙ్గధన్వా గదాధరః/ రథాంగపాణిరక్షోభ్యః సర్వప్రహరణాయుధః 149.120. శ్రీ సర్వప్రహరణాయుధ ఓం నమ ఇతి... అనే మహాస్తోత్ర రత్నం వరకూ మహావిష్ణువు యొక్క పవిత్ర నామాలను కీర్తించాడు పితామహుడు. ఇక్కడ ఇంకో అద్భుతమైన **విషయమేమిటంటే విష్ణుసహస్రనామాలను ఈ అనుశాసనపర్వంలో 149 వ అధ్యాయంలో శ్రీకృష్ణుని సాన్నిధ్యంలో భీష్ముడు చెబితే, ఇదే పర్వంలో 17వ అధ్యాయంలోనే సాక్షాత్తు శ్రీకృష్ణుడే స్వయంగా శివసహస్రనామాలను అందరికీ ఉపదేశించటం జరిగింది**. ఈ రెండు స్తోత్రాలనూ కూడా మానవాళికి మోక్షకారకాలుగా, మానవుడిని మాధవుడి సాన్నిధ్యానికి చేర్చే పరమపావన స్తోత్రాలుగా అందించారు వ్యాసులవారు. గాంగేయుడు యుధిష్ఠిరుడిని హస్తినకు వెళ్ళమని అనుమతించాడు. నాయనా ధర్మరాజా! సాధ్యమైనన్ని యాగాలు చేయి. అన్నదానం చేసి శ్రద్ధగా దక్షిణలు ఇస్తూ ఉండు. క్షత్రియధర్మమందు ఆసక్తితో ఉండి పితృదేవతలను తృప్తి పరచు. ఇప్పుడు వెళ్ళి నేను శరీరాన్ని విడిచిపెట్టే ఉత్తరాయణకాలంలో తిరిగి రా నాయనా! అని ఆదేశించాడు. కుంతీపుత్రుడు తాతగారికి శ్రద్ధగా నమస్కరించి గాంధారిని, ధృతరాష్ట్రుడిని ముందుంచుకుని, ఋషులతోనూ, కృష్ణపరమాత్ముడితోనూ, సోదరులతోనూ కలిసి హస్తినాపురానికి చేరుకున్నాడు. తరువాత మహాప్రాజ్ఞుడైన యుధిష్ఠిరుడు రాజ్యాభిషిక్తుడయ్యాడు. అమాత్యులందరినీ వారివారి పనులలో నియమించాడు. అలా **ధర్మరాజు హస్తినాపురంలో ఏబది రోజులు నివసించాడు.** ఉషిత్వా శర్వరీః శ్రీమాన్ పంచాశన్నగరోత్తమే./ సమయం కౌరవాగ్రస్య సస్మార పురుషర్షభః. 167.5

తరువాత పితామహుడు నిర్దేశించిన సమయాన్ని స్మరించుకుని సూర్యుడు ఉత్తరాయణంలో ప్రవేశించటం గమనించి తిరిగి పితామహుడి వద్దకు బయలుదేరాడు. భీష్ముడు కనులు తెరిచి "యుధిష్ఠిరా! సకాలంలో వచ్చావు నాయనా! నేను వాడియైన ఈ

AUCHITHYAM
International Research Journal for Telugu Language & Literary Studies
ISSN: 2583-4797
UGC-CARE listed Journal
Publishing by: Dr. Rambhatla Parvatheeswara Sarma, Dr. RVRM Trust, 12-121/17, Flat No. 402, Satyanagar, Chinamusidiwada, Pendurthy, Visakhapatnam-531173. AP, India. +91 9247859580.

AUCHITHYAM UGC-CARE Listed Journal | Volume-4 | Issue-8 | July 2023 | ISSN: 2583-4797

Article Link: https://www.auchithyam.com/2023/jul_2023/full_papers/july23_13.php

**బాణాలమీద పడుకుని నేటికి ఏబది ఎనిమిది రోజులయింది.** చివరిగా యుధిష్ఠిరుడితో అంటున్నాడు. రాజా! నీవు **ఎల్లప్పుడూ ప్రాజ్ఞులైన బ్రాహ్మణులను విశేషంగా పూజించు, గురువులను ఋత్విక్కులను పూజించు అని చివరి మాటగా చెప్పాడు".** బ్రాహ్మణశ్చైవ తే నిత్యం ప్రాజ్ఞశ్చైవ విశేషతః/ ఆచార్యా ఋత్విజశ్చైవ పూజనీయా జనాధిప.167.52

ఇన్ని ఉపదేశాలు చేసి చివరికి పలికిన ఈ మాటలు ఏంతో ప్రాముఖ్యతను సంతరించుకున్నాయనే చెప్పాలి. అనంతరం భీష్ముడు మౌనంగా ఉండిపోయాడు. ఆయన చేత క్రమమార్గంలో నిరోధించబడిన ఆయన ప్రాణాలు ఊర్ధ్వమార్గంలో ప్రయాణించాయి. యోగాభ్యాసంలో ఏయే శరీరభాగాలనుండీ ప్రాణాలను ఉపసంహరించాడో ఆయా శరీర భాగం ఆయనలో శల్యవిముక్తమయింది. తరువాత పాండవులు శాస్త్ర ప్రకారం పితృకార్యాన్ని నిర్వర్తించారు. ధర్మజాదులు శ్రీకృష్ణ పరమాత్మునితో కలిసి హస్తినకు బయలుదేరారు.

### ౯. ముగింపు

భీష్మపితామహుని ఉపదేశామృతము మహాభారతానికే మకటాయమానము. పంచమవేదములో(మహాభారతం) చెప్పిన కౌరవపాండవుల గాధను విని, అందలి అంశములను గ్రహించుట ఒక యజ్ఞమయితే, శాంతి అనుశాసనపర్వాలలోని ధర్మాలను తెసుకుని వాటిన వీలయినంత ఆచరించే సాధకుడు పరిపూర్ణత్వమును తప్పక సాధించగలుగుతాడు. సమస్త ధర్మాలను తెలిసన ధర్మరాజే ఏమీ తెలియని వానివలే పితామహుని వద్ద శ్రీకృష్ణుని ఆజ్ఞతో సమస్త ధర్మాలను మరలా విని తెలుసుకున్నాడంటే, ఇంక సామాన్యులు ఎంత విశేష ప్రయత్నం చేసి ధర్మాచరణలో నిమగ్నమవ్వాలో నేటి తరాలు తెలుసుకోవలసిన ముఖ్యాంశం. రాజధర్మాలు, అతిథిధర్మాలు, ఆపద్ధర్మాలు, ఆశ్రమధర్మాలు, మోక్షధర్మాలు .. ఇలా సమస్త ధర్మాలను వేదసారాన్ని గ్రహించి పంచమవేదంలో శాంతి అనుశాసన పర్వాలలో భీష్మ-ధర్మజ సంవాదంలో మనకు అందించారు వేదవ్యాసులవారు.

### 10. ఉపయుక్తగ్రంథసూచి:

1. కృష్ణాచార్య, టి.ఆర్., & వ్యాసాచార్య, టి.ఆర్. (సంపా.). శీమన్మమహాభారతమ్. నిర్ణయసాగర్ ప్రెస్, కుంభకోణం, బోంబే.
2. పట్నాయక్, కె.ఎన్.ఎస్. "ది మహాభారతమ్ క్రోనోలజీ". (వ్యాసము). నవంబరు
3. ప్రతాప్ చంద్ర, రాయ్ (అను.). ది మహాభారత. ఓరియంటల్ పబ్లిషింగ్ కో., కలకత్తా.
4. మోహన్ గంగూలి, కిసరి. (అను.). ది మహాభారత.
5. రామకృష్ణమూర్తి, తిప్పాభట్ల. & శ్రీనివాసులు, సూరం. వ్యాసమహాభారతము. విజయవాడ. 2010
6. రామనారాయణదత్త శాస్త్రీ ,పాండ్యే. (హిందీ అను.) మహాభారతము. గీతాప్రెస్.
7. శాస్త్రి, పి.పి.ఎస్. (సంపా.). ది మహాభారత. వావిళ్ళరామస్వామిశాస్త్రులు అండ్ సన్స్.

***

**గమనిక: ఈ పత్రికలోని వ్యాసాలలో అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి.**
**వాటికి సంపాదకులు గానీ, పబ్లిషర్స్ గానీ ఎలాంటి బాధ్యత వహించరు.**